క్లుప్తంగా

విద్యార్థికి ఒక మొక్క



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పుంగనూరు: ఒక విద్యార్థికి ఒక మొక్క అన్న నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ కాలుష్యాన్ని నివారించి, హరిత ప్రస్థానం ప్రారంభించాలని కోరారు. తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అలాగే కళాశాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సదుం: మండల కేంద్రమైన సదుం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల 13 మంది ఉపాధ్యాయులు ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యారు. వారిని ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. రిటైర్డ్ హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుందన్నారు. వృత్తిలో నిష్పక్షపాతం ఉండాలని, అప్పుడే బాగా రాణిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో చాముండేశ్వరిదేవి



పుంగనూరు: పట్టణంలోని తూర్పుమొగసాలలో వెలసిన చాముండేశ్వరిదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు జెట్టికుల స్తులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టణంలో ఊరేగించారు. ఈ నెల 25 వరకు జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయం



నవధాన్యాలను పరిశీలిస్తున్న మేనేజర్ వాసు

పులిచెర్ల(కల్లూరు): ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు తెలిపారు. ఆయన శుక్రవారం పాతపేట పంచాయతీలో నవధాన్యాల సాగును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో నవ ధాన్యాలను అంతరపంటగా సాగు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గురుప్రభాకర్, రమేష్, మునిచంద్ర, సుమిత్ర, రెడ్డివాణి పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా సమీపతి



పుంగనూరు: పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నల్లబాల సమీపతిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ద్వారా రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.

రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలు పంపిణీ

గుడుపల్లె: మండలంలోని చీకటిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులకు శుక్రవారం ఏవో రాజ్యలక్ష్మి ఉచితంగా వేరుశనగ విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఒక్కొక్క రైతుకు 30 కిలోల బస్తా అందజేసినట్టు తెలిపారు. వర్షం పడిన వెంటనే పొలాల్లో విత్తనాలు విత్తాలని సూచించారు. నాయకులు బాబునాయడు పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

పుంగనూరు: మండలంలోని బర్నేపల్లెలో శుక్రవారం ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చంద్రశేఖర్, శంకర్ వ్యాపార లావాదేవీలపై ఘర్షణ పడ్డారు. దీంతో శంకర్ తలకు రక్త గాయాలయ్యాయి. బాధితుడిని కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.






రైతులు నాటుకున్న కలిమిచెట్లు, నాగజెముడు, బ్రహ్మజెముడు, గారచెట్లు

ముళ్లచెట్లతో గజరాజులకు చెక్!

ఏనుగులు తరచూ అటవీ సమీపంలోని గ్రామాల్లోకి వచ్చి పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. ఒక్కోసారి రైతులను తొక్కి చంపేస్తున్నాయి. వాటిని కట్టడి చేయడానికి అటవీ శాఖ అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం లేదు. సోలార్ ఫెన్సింగ్‌లు, ఎలిఫెంట్ ట్రెంచ్‌లు ఏర్పాటుచేసినా ఏనుగులు యథేచ్ఛగా వస్తూనే వున్నాయి. ఈ క్రమంలో బాధిత రైతులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. తమ పొలాల చుట్టూ కంచెలా కలిమి, గారముండ్లు, ఈత, బ్రహ్మజెముడు, నాగజెముడు, గార తదితర ముళ్ల చెట్లను పెంచుకుంటున్నారు. వాటికి ముళ్లు వుండడం వల్ల ఏనుగులు పొలాల్లోకి వచ్చేందుకు కష్టమవుతుంది.



పంటపొలాల్లో తిరుగుతున్న ఏనుగులు (ఫైల్)

- పనిచేయని సోలార్ ఫెన్సింగ్
- ఉపయోగం లేని ఎలిఫెంట్ ట్రెంచ్‌లు
- కుంకీలతోనూ ఫలితం లేనట్టే
- కొత్త మార్గాలను అన్వేషిస్తున్న రైతులు

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలమనేరు, కుప్పం నియోజకవర్గాల పరిధిలో 250 కిలోమీటర్ల మేర కౌండిన్య అభయారణ్యం వ్యాపించి ఉంది. ఇందులో వంద వరకు ఏనుగులు వున్నాయి. ఇవి గుంపులుగా విడిపోయి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నాయి. అడవిని దాటి బయటకు వచ్చి పంట పొలాలపై పడుతున్నాయి. పంటలను ధ్వంసం చేస్తున్నాయి. రైతులను తొక్కి చంపిన సంఘటనలు చాలానే వున్నాయి. ఈ సమస్య దశాబ్దాలుగా నెలకొంది.

ఏనుగులను కట్టడి చేయడానికి ప్రభుత్వం 1984లో కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చురీని ఏర్పాటుచేసింది. ఇందులో భాగంగా రూ.లక్షలు వెచ్చించి బంగారుపాళ్యం మండలం నుంచి కుప్పం వరకు 230 కిలోమీటర్ల మేర సోలార్



అడవిలోంచి ఏనుగుల రాకుండా తవ్విన ట్రెంచ్‌లు

ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసింది. అదేవిధంగా కర్ణాటక టైప్ సోలార్ ఫెన్సింగ్‌ను కొంత మేర ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసింది. మరోవైపు ట్రెంచిలు తవ్వించింది. ఏనుగులు ఫెన్సింగ్‌కు ఏర్పాటు చేసిన రాతి స్తంభాలను ధ్వంసం చేసి పంట పొలాల్లోకి వస్తున్నాయి. పంటలను ధ్వంసం చేస్తూనే వున్నాయి.

కుంకీ ఏనుగులతో కట్టడికి ప్రయత్నాలు

ఫెన్సింగ్, ట్రెంచ్‌లు తవ్వినా ఫలితం లేకపోవడంతో అటవీశాఖ అధికారులు ఇటీవల ముసలిమొడుగు వద్ద ఎలిఫెంట్ క్యాంపును ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగా ఏడు కుంకీ ఏనుగులను తీసుకువచ్చారు. వాటికి శిక్షణ ఇచ్చి మదపుటేనుగులను కట్టడి చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రక్రియ జరగడానికి చాలానే సమయం పట్టేలా వుండడంతో రైతులు కొత్త ఆలోచనలు చేస్తున్నారు.

పొలాల చుట్టూ కంచెలా ముళ్ల చెట్లు

అడవికి ఆనుకుని పొలాలు వున్న రైతులు తమ పంటల్లోకి ఏనుగులు రాకుండా వుండేందుకు సొంతంగా సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఆర్థిక స్థోమత లేని వారు పొలం సరిహద్దులో కలిమిచెట్లను నాటుకుంటున్నారు. వీటికి ముండ్లు ఉండడంతో ఏనుగులు రావు. ఆదాయం కూడా వస్తుంది. మరికొంతమంది గారముండ్లు, ఈత, బ్రహ్మజెముడు, నాగజముడు, గార తదితర ముళ్ల మొక్కలను పెంచుకుంటున్నారు. కొందరు రైతులు మల్బరీ మొక్కలను నాటి వాటిని మూడు అడుగుల దాకా ఉంచి పైభాగాన్ని కట్ చేస్తున్నారు. మల్బరీ మొక్కలు గుచ్చుకోవడం వల్ల ఏనుగులు పొలంలోకి రావని రైతులు చెబుతున్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కుప్పం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సాయిమాత సేవాట్రస్టు ప్రతినిధులు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు కంటి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారిని ఆపరేషన్లకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేషనల్ హైవేలో టిప్పర్ బోల్తా



రెడ్డిచెరువు వద్ద బోల్తా పడిన టిప్పర్

రొంపిచెర్ల: మండలంలోని పెద్దగొట్టిగల్లు పంచాయతీలోని రెడ్డిచెరువు వద్ద బెంగళూరు–తిరుపతి జాతీయ రహదారిలో గురువారం రాత్రి టిప్పర్ బోల్తా పడింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు పనుల్లో భాగంగా టిప్పర్‌తో మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఖాళీ టిప్పర్ రోడ్డుకు ఏర్పాటు చేసిన ఐరన్ ఫెన్సింగ్‌ను ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

టీబీతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వెంకట ప్రసాద్

పలమనేరు: టీబీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా టీబీ అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం కొలమాసనపల్లి పీహెచ్‌సీలో టీబీపీఐ వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, ప్రభుత్వ ఆస్పతుల్లో అందే వైద్య సేవలపై ప్రజలకు తెలియజేయాలని సూచించారు. డాక్టర్ అనొఖీ, సీహెచ్‌వో విజయకుమారి, ఎంపీహెచ్‌ఎస్ మధు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి పనులేవీ..?

- ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- చర్యలు తీసుకుంటామన్న ఆర్డీవో



ఆర్డీవో భవాని

పలమనేరు: పలమనేరు డివిజన్‌లోని ఎస్సీ, ఎస్టీ కూలీలకు ఉపాధి పనులు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు ఆరోపించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఆర్డీవో భవాని అధ్యక్షతన డివిజనల్ స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ప్రకారం పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు అగ్రస్థానం కల్పించాలని కేంద్రం నిర్దేశించిందన్నారు. ఇక్కడి అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి నేత లు చెప్పిన వారికే పనులు కల్పించి అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. దీంతో కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. గంగవరం మండలం గుండుగల్లు, బంగారుపాళెం మండలంలో ఎస్సీ, ఎస్టీలపై అగ్రవర్ణాల వారు దాడులు చేసినా నిందితులపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో భవాని మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు పనులు కల్పించేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు శివాడి గోవిందు, మునిరత్నం, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

గంగవరం తహసీల్దార్‌గా రేఖ



తహసీల్దార్ రేఖను అభినందిస్తున్న సిబ్బంది

గంగవరం: మండల నూతన తహసీల్దార్‌గా రేఖ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ఎస్ఆర్.పురం తహసీల్దార్‌గా పనిచేస్తూ జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లారు. అక్కడి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ మాధవరాజు జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. రేఖ మాట్లాడుతూ మండలంలో భూమి, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రైతులు తమ సమస్యలపై నేరుగా తనను కలిసి పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

తూనికలు, కొలతల శాఖ రహస్య తనిఖీలు

పలమనేరు: తూనికలు, కొలతల శాఖ సీఐ రమాదేవి, సిబ్బంది శుక్రవారం పలమనేరులో రహస్యంగా తనిఖీలు చేపట్టడం పలు విమర్శలకు తావిస్తోంది. సాధారణంగా అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు మీడియాకు తెలియజేస్తుంటారు. ప్రస్తుతం తనిఖీలకు వచ్చిన అధికారులు గోప్యత పాటించారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదా జరిమానాలు విధించడం లాంటివి చేయలేదు. దుకాణదారులతో మాట్లాడి ఎంతో కొంత జేబులో వేసుకొని గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిపోయినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలోనూ స్థానిక మార్కెట్‌లో తనిఖీలు చేసిన ఓ మహిళా సీఐపై అక్కడి వ్యాపారులు లంచం విషయంలో గట్టిగా నిలదీయడం చర్చనీయాంశమైంది. అయినా అధికారుల తీరు మారలేదు. గుట్టుచప్పుడు కాకుండా తనిఖీలకు రావడం, నిబంధనలు పాటించని వారి నుంచి మామూళ్లు తీసుకుని గప్‌చుప్‌గా వెళ్లడం రివాజుగా మారింది. దీనిపై ఉన్నతాధికారులైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్లాస్టిక్ వద్దు జ్యూట్ బ్యాగులే మేలు



వారపు సంతలో జ్యూట్ బ్యాగులు విక్రయం

పలమనేరు: ప్లాస్టిక్ కవర్లు కాకుండా జ్యూట్ బ్యాగులను వాడాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం జేఆర్‌వై కాంప్లెక్స్‌లో మెప్మా మహిళల ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. వాటిని వారపు సంతలో విక్రయించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటోందన్నారు. ప్రతి ఒక్కరూ జ్యూట్ బ్యాగులను వాడాలన్నారు. అనంతరం ఆయన ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలు, భోజనం, పారిశుద్ధ్యం, ఓపీ సేవలను పరిశీలించారు. ఆయన మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, మెప్మా మేనేజర్ బాబా, ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు నాగరాజు, నాయకులు సుబ్రమణ్యం గౌడు, గిరిబాబు, కుట్టి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా దుర్గామాత



వి.కోట: పట్టణంలో వెలసిన దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం ఆషాఢ అష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా అమ్మవారిని శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ ఉత్తరాయణం ముగిసి దక్షిణాయనం ప్రారంభమవుతున్న తరుణంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసినట్టు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న యువరాజ్

వి.కోట: అందరం కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ యువరాజ్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం చింతమాకులపల్లి పంచాయతీ పసలమంద గ్రామంలోని తన స్వగృహంలో వైఎస్సార్ సీపీ నూతన కార్యవర్గ సభ్యులతో సమావేశమయ్యారు. వారిని ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆశీస్సులతో పదవులు పొందిన వారు గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికివదిలేసి మోసం చేసిన వైనాన్ని ప్రజలకు వివరించాలన్నారు. గతంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని, అమలుచేసిన పథకాలను వివరించాలని తెలిపారు. గత ప్రభుత్వం, ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వానికి మధ్య తేడాను తెలియజేయాలని సూచించారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్, అమరనాథ్, పవన్‌కుమార్, కుమార్‌రాజా, శశికళ, సుధాకర్‌రెడ్డి, సరస్వతి, మంజునాథ్, మణి, రామచంద్రప్ప, కృష్ణ, శ్రీనివాసులు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీని వరించిన మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి



సుజాత

రొంపిచెర్ల: రొంపిచెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఉపాధి కూలీకి వరించింది. మార్కెట్ కమిటీ పదవిని రొంపిచెర్ల మండలం గానుగచింతకు చెందిన ఎస్టీ మహిళకు ఇవ్వాలని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బీజేపీ నాయకులు తమ వారికి కేటాయించాలని పట్టుబట్టడంతో పులిచెర్ల మండలం కల్లూరు గ్రామ పంచాయతీ తలారీ వారిపల్లె దళితవాడకు చెందిన కొండా సుజాతను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె బీజేపీలో అనేక ఏళ్లుగా పనిచేస్తోంది. నిన్నటి వరకు ఉపాధి పనులు చేసుకుంటున్న ఆమెకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వరించడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎస్.మాధవ్, జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదాస్ లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పలమనేరు పోలీసు స్టేషన్ తనిఖీ

పలమనేరు: పట్టణంలోని పోలీసు స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ మణికంట చందోలు తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, విధుల నిర్వహణ, రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించి నిందితులను అరెస్టు చేయాలని ఆదేశించారు. హైవేలో రోడ్డు ప్రమాదాలు జరిగే హాట్ స్పాట్లలో వాహనాల వేగ నియంత్రణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పోలీసు క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ డేగల ప్రభాకర్, సీఐ నరసింహరాజు, ఎస్ఐ లోకేష్ వున్నారు.

వేడుకగా అర్జున తపస్మాన్



తపస్సు మానును అధిరోహిస్తున్న అర్జున పాత్రధారి

సదుం: పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని భట్టువారిపల్లెలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం అర్జున తపస్మాన్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్జునుడు తపస్సుమాను అధిరోహించే ఘట్టాన్ని వేంకటేశ్వర నాట్యకళా మండలి సభ్యులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. అర్జున పాత్రధారి పద్యాలను ఆలపిస్తూ తపస్సుమానును అధిరోహించాడు. అక్కడి నుంచి విసిరే నిమ్మకాయల కోసం భక్తులు పోటీ పడ్డారు. సంతానం కోసం మహిళలు తపస్సుమాను వద్ద ఒరపడ్డారు. భాగవతారిణి జ్యోత్స్న మధ్యాహ్నం హరికథా గానం చేశారు. భక్తులకు నిర్వాహకులు ప్రసాదం పంచిపెట్టారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, మల్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, రామాంజులు, శివారెడ్డి, మనోహర్‌రెడ్డి, వెంకటరెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో భారీ వర్షం




బేస్తపల్లె రోడ్డులో అడ్డంగా పడిన చెట్టు, రొంపిచెర్ల శివాలయం వద్ద కూలిన ఆంజనేయ స్వామి ఆలయం

- దెబ్బతిన్న ఆంజనేయ స్వామి గుడి
- చెరువులు, కుంటల్లోకి చేరిన వర్షపు నీరు



నిండిన తాటిమాకులకుంట

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలో గురువారం రాత్రి మళ్లీ భారీ వర్షం కురిసింది. నెల రోజులుగా వర్షం కురవకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగ విత్తనాలు విత్తలేకపోయారు. ఈ ఏడాది వేరుశనగ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసి 104.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం రాత్రి మరోసారి భారీ వర్షం కురవడంతో 73.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కుంటలు నిండాయి. కట్టకింద శివాలయం వద్ద చెరువు కట్టకు కట్టిన రాతి కట్టడం కూలి ఆంజనేయ స్వామి ఆలయం మీద పడడంతో నేల మట్టమైంది. స్వామి విగ్రహం శిథిలమైంది. రొంపిచెర్ల బెస్తపల్లె సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడింది. లక్ష్మీనారాయణ కాలనీ నుంచి నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సత్యంరెడ్డి జేసీబీతో కాలువలో పూడికతీయించి నీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాల వెనుక ఉన్న తాటిమాకులకుంట నిండి పోయింది. రెండు రోజులు భారీ వర్షం పడడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కాలంలో ఇంత పెద్ద వర్షాలు ఎప్పుడు చూడలేదని ప్రజలు తెలియజేశారు.

ఎస్టీ కాలనీ అభివృద్ధికి ప్రణాళికలు



స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

శాంతిపురం: మండలంలోని శివరామపురం పంచాయతీ ఒడ్డువంక ఎస్టీ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్టు ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం పంచాయతీ కార్యదర్శి గిరిబాబు, సచివాలయ సిబ్బందితో కలిసి కాలనీలో సదుపాయాలను పరిశీలించారు. రోడ్డు, తాగునీటి వసతి కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పింఛను, పక్కా ఇళ్లకు అర్హులను గుర్తించి జాబితాలు తయారు చేయాలన్నారు.